క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతంపేట: మండలంలోని కోతాం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం సందర్శించారు. చిన్నారుల హాజరు, వారికి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. సరైన పోషకాహారాన్ని అందివ్వాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. పిల్లల పఠన సామర్థ్యాలను పరిశీలించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

జియ్యమ్మవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సహా వెలుగు కార్యాలయంలో గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. తుంబలి, ఎం.అల్లువాడ, పిప్పలబద్ర, తాళ్లడుమ్మ, చినమేరంగి, పరజపాడు, పెదమేరంగి, కన్నపుదొరవలస, బిత్రపాడు, గవరమ్మపేట, చింతలబెలగాం, కుదమ, తురకనాయుడువలస, బాసంగి పంచాయతీలకు చెందిన వారు హాజరయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



డ్రమ్ములతో పట్టుబడిన బెల్లం ఊటలు

సీతంపేట: చిన్నబగ్గ పరిసర ప్రాంతంలో 300 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. సారా వంటకాలు చేయడానికి బెల్లం ఊటలు సిద్ధం చేశారనే సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. డ్రమ్ములతో బెల్లం ఊటలు ఉన్నాయని వాటిని పారబోసినట్టు తెలిపారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక



ధ్రువపత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారులు

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ కాలువ పరిధిలోని రావివలస డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. చైర్మన్‌గా ముచ్చర్ల నందీశ్వరరావు, ఉప చైర్మన్‌గా గంట సీతంనాయుడులు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.భరత్‌కుమార్, ఎన్నికల అధికారి కె.రాబర్ట్‌పాల్, తహసీల్దారు పి.బాలలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



ధనుర్మాస పూజల ఆవశ్యకతను వివరిస్తున్న అర్చకులు, వక్తలు

పాలకొండ రూరల్: స్థానిక దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన కాశీవిశ్వేశ్వరుని మందిరంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆంజనేయశర్మ నేతృత్వంలో మంగళవారం గీతాపారాయణ కార్యక్రమంతో పాటు ఆధ్యాత్మిక సత్ సంఘం నిర్వహించారు. ప్రస్తుత మాసంలో చేపట్టదలచిన సాంప్రదాయ పూజల విశిష్టతను అర్చకులు వివరించారు. మేలుకొలుపు కార్యక్రమం ఆవశ్యతకపై భక్తులకు అవగాహన కల్పించారు.

ఏకగ్రీవ ఎన్నిక

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం నీటిపారుదల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా చేబోదుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా రౌతు సోంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధిలో ఇటీవల ఎన్నిక కాబడిన నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన టీసీలు వీరిని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం రైతుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేస్తామన్నారు. సహచర సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.

జాగ్రత్తలతో మెరుగైన జీడిపూత





ఏజెన్సీలో పూత దశలో జీడి పంట (ఇన్‌సెట్లో) తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారిణి

పాలకొండ రూరల్: జిల్లాలో ఏజెన్సీ సీతంపేటతో పాటు మరో పది మండలాల్లో జీడి పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఏటా 23 వేల హెక్టార్లలో పండించే జీడి పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. ఈ తరుణంలో జీడి రైతులు తగు జాగ్రత్తలు పాటించకుంటే శీతాకాలంలో కురిసే మంచు, పొగమంచు, ఇతర కీటకాలు కారణంగా పూత పాడయ్యే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారిణి తమ్మినేని అమరేశ్వరి సూచిస్తున్నారు.

కొమ్మ, పుష్పగుచ్చాలు తొలిచే పురుగు

శీతాకాల సీజన్‌లో పూత దశలో కొమ్మ, పుష్పగుచ్చాలు తొలిచే పురుగు కారణంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా టీ దోమ, కాయతొలుచు పురుగు, తామర పురుగులు, పిండినల్లి వలన నష్టం ఏర్పడుతుంది. ఈ పురుగులు లేత కొమ్మల చివర్లను తొలచి సొరంగం చేసి లోపల గుజ్జును, పుష్పగుచ్ఛాలను తొలుస్తుంది. దీని కారణంగా కొమ్మలు, పూత ఎండిపోతుంది. అలాగే కాయ, గింజల మధ్య ప్రదేశంలో ఆశించే పురుగులు పండులోని గుజ్జును, గింజలోని పప్పును తిని నష్టపరుస్తాయి. దీనికితోడు తామర పురుగులు ఎదుగుతున్న కాయలను, పండ్లను గీకి రసం పీల్చడం వలన కాయలపై గరకు మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గిపోతుందని పేర్కొన్నారు. వీటిని నిర్మూలించేందుకు ఒక్కో మొక్కకు యూరియా అర కేజీ, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 125 గ్రాముల వంతున అందించాలి. చెట్టు మొదలు వద్ద 4 అడుగుల దూరంలో పళ్లెం ఏర్పాటు చేసి ఈ మందులు వేసి నీరు పెట్టాలి. జనవరి నెలలో పువ్వు, పిందె దశలో టీ దోమ ఆశించే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు మోనో క్రోటోఫాస్ 1.6 మిల్లీలు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండో దశ ఫిబ్రవరి మొదటి వారంలో క్లోరిపైరిపాస్ 2 మిల్లీలీటర్ల లేదా లామ్డాసైహాలోత్రిన్ 0.6 మిల్లీ లీటరు నీటిలో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తామర పురుగు నష్టం కలుగజేస్తుంది. దీనిని అరికట్టేందుకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలు లేక మోనోక్రొటోఫాస్ 1.6 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అన్ని దశల్లో వ్యాప్తి చెందే పిండినల్లి అరికట్టేందుకు 2.5 మిల్లీల డైక్లోరోవాస్ లేదా డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అందరి సహకారంతోనే అభివృద్ధి



వీరఘట్టం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: గ్రామ పంచాయతీల అభివృద్ధి అందరి బాధ్యత అని ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేయడంతో పాటు తాగునీరు, పారిశుధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి కళ్యాణిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ: గ్రామాల అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ విజయరంగారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సక్రమమైన పద్ధతిలో ప్రజలకు అందించడం, నిధులు సద్వినియోగం చేసుకోవడం, గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాగునీరు పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంపీపీ బి.భాను, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి: శిక్షణార్థులకు సూచనలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధి జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. రెండో విడత కింద గరుగుబిల్లి, గొట్టివలస, శివ్వాం, కొత్తూరు, రావుపల్లి, కొత్తపల్లి, పెద్దూరు, బీవీపురం, చినగుడబ, వల్లరగుడబ, ఆర్థీవలస, పెదగుడబ, ఎస్ఆర్‌పేట, పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు బుధవారం శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏపీఎం బి.అప్పలనాయుడు, ఏవో అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. గ్రామాల్లోని ప్రజాసమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. అనంతరం గృహ నిర్మాణాల ఆలస్యంపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జి.సంపత్‌కుమార్, బి.నరేష్, ఎంపీడీవో ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి దినేష్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువమంత్రజోల గ్రామంలో గిరిజన విద్యార్థి పత్తిక దినేష్(14) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దొరజమ్ము గ్రామ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దినేష్.. దసరాల సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చి తీవ్ర అనారోగ్యం బారినపడ్డాడు. అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది వైద్య సేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు విద్యార్థిని తరలించి, చికిత్స అందజేశారు. పచ్చకామెర్లు సహా కిడ్నీ సంబంధిత వ్యాధులతో విద్యార్థి బాధపడుతున్నట్లు వైద్యుల పరిశీలనలో తేలింది. ఆ తర్వాత కొన్ని రోజులకు తల్లిదండ్రులు దినేష్‌ను ఇంటికి తీసుకురాగా, ఇంటి వద్దనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో మంగళవారం అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 14 మంది వరకు విద్యార్థులు మరణించారని, అయినప్పటికీ విద్యార్థుల మరణాలు అరికట్టే చర్యలు శూన్యమని విమర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తల నియామకంపై తన తొలి సంతకం అని చెప్పిన మంత్రి ఆ హామీని నిలబెట్టులేకపోవడం సిగ్గుచేటన్నారు. ఓ వైపు విద్యార్థుల మరణాలు.. మరోవైపు గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమ్మెతో గిరిజన పాఠశాలల్లో గందరగోళం నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, విద్యార్థుల మరణాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నగదు రహిత సేవలు అందించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి రమణ

పాలకొండ రూరల్: విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అన్ని ఆస్పత్రుల్లో అందించాలని విశ్రాంత ఉద్యోగుల అసోషియేషన్ కార్యదర్శి కేవీ రమణ అన్నారు. సంఘ సర్వసభ్య సమావేశం పాలకొండలో మంగళవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కె.చౌదరినాయుడు నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా 80 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రస్తుత ఏడాదికి సంబంధించిన డీఆర్‌లు తక్షణమే మంజూరు చేయాలన్నారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

ఆశాజనకంగా అపరాల పంటలు



పార్వతీపురం: మండలంలోని అపరాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వరికోతలు కోసేందుకు ముందు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులు అపరాలు వేసేందుకు ఆసక్తి కనబర్చారు. ఇందులో భాగంగా సుమారు 2,200 ఎకరాల్లో మినుము, పెసలు, ఉలవలు వంటి పంటలు వేశారు. ప్రస్తుతం మండలంలోని ములగ, ఎంఆర్ నగరం, గోపాలపురం, చినబొండపల్లి, సంగంవలస, గంగాపురం, కవిటిభద్ర, తాళ్లబురిడి, పెదబొండపల్లి, చినబొండపల్లి, బందలుప్పి, జమదాల, నర్సిపురం తదితర గ్రామాల్లో అపరాల పంటలు రైతుకు సంతోషాన్నిచ్చే విధంగా కన్పిస్తున్నాయి. కాగా అల్పపీడనం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీచేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతు సమస్యలపై స్పందించాలి



నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బుడితి అప్పలనాయుడు అన్నారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను మంగళవారం ఆయన కలిసి అభినందించారు. స్థానిక సమస్యలు వివరించారు. నూతన కార్యవర్గాల్లో అధికులు తోటపల్లి కాలువల ఆధునికీకరణ సాధన సమితి సభ్యులతో పాటు, సాగునీటి సమస్యలపై అవగాహన ఉన్నవారు కావడం సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు.

– పాలకొండ రూరల్

రైతులు అప్రమత్తంగా ఉండాలి



అంపిలి రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో మూడు రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ని వాహిని స్థానిక రైతులను అప్రమత్తం చేశారు. మంగళవారం మండల పరిధిలో అన్నవరం, అంపిలి, గోపాలపురం పంచాయతీలకు సంబంధించిన రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి రికార్డులు, ధాన్యం సేకరణపై సహాయకులు సుప్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ధాన్యం సేకరణపై అవగాహన కల్పించారు. వర్షం కారణంగా రైతులు నూర్పిళ్లు వాయిదా వేయాలన్నారు. కళ్లాల్లో నిల్వ ఉన్న వరి చేలు, ధాన్యం బస్తాలకు రక్షణ కల్పించాలన్నారు. భారీ వర్ష హెచ్చరికలు ఉన్న క్రమంలో ముందస్తు చర్యలపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

అలకలు.. బుజ్జగింపులు

- ముగిసిన నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు



వీరఘట్టంలో జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల్లో నిబంధనలు చెబుతున్న ఎన్నికల అధికారి

వీరఘట్టం: జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు అయిన తోటపల్లి జలాశయంలో ఉన్న 25 నీటి సంఘాల పరిధిలో ఉన్న ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో పలువురు అలకబూనగా వారిని బుజ్జగిస్తూ ఎన్నికలను కూటమి నాయకులు జరిపించారు. వీరఘట్టం, తూడి, ఎం.సింగుపురం, రావివలస, రాజులగుమ్మడ డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసారు. ఒక్కో డిస్ట్రిబ్యూటరీలో ఉన్న 5 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు ఈ ఎన్నికల్లో పాల్గొని వారిలో ఒకరిని డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వీరఘట్టం మండలంలోని తూడి డిస్ట్రిబ్యూటరీలో ఖండాపు హరిబాబుకు ఎమ్మెల్యే జయకృష్ణ ప్రతిపాదించగా దీనికి మిగిలిన వారు సమ్మతించలేదు. దీంతో ఇక్కడ కొంత గందరగోళం ఏర్పడింది. కూటమి పెద్దలు అందరినీ సముదాయించి, బుజ్జగించి తుమరాడ నీటి సంఘం అధ్యక్షుడు బొత్స వెంకటనాయుడుకు తూడి డీసీగా ఎన్నుకున్నారు. హరిబాబుకు ఉపాధ్యక్షుడిగా తీర్మానం చేసారు. పాలకొండ మండలం ఎం.సింగుపురంలో డీసీగా చేబోతుల లక్ష్మీనారాయణను, ఉపాధ్యక్షుడిగా రౌతు స్వామి బాబులను, వీరఘట్టం డీసీగా పొదిలాపు విజయరమణి, ఉపాధ్యాక్షుడిగా చింత ఉమామహేశ్వరరావు, గరుగుబిల్లి మండలం రావివలస డీసీగా మాచర్ల నందీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గంట సీతంనాయుడు, వంగర మండలం రాజులగుమ్మడ డీసీగా ఆలుబిల్లి పార్థసారధి,ఉపాధ్యక్షుడిగా పల్లా పాపినాయుడులను ఎన్నుకున్నారు. ఇక తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ ఐదు డీసీల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈ ఎన్నిక ఈ నెల 20 లేదా 21న జరగొచ్చని జల వనరుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



రైల్వేగేటు వద్ద అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

కొమరాడ: మండల పరిధిలోని రైల్వేగేటు, ఆర్తాం కూడళ్ల వద్ద రోడ్డు భద్రతా నియమాలపై ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) సత్యనారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. మద్యం తాగి వాహనం నడపవద్దని, మైనర్లకు వాహనం ఇవ్వవద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

కొమరాడ: మండలంలోని కోటిపాం గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులు మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ కె.నీలకంఠం మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

సర్పంచ్‌లను భాగస్వామ్యం చేయాలి

భామిని: గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రతీ కార్యక్రమంలో సర్పంచ్‌లను భాగస్వామ్యం చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు అన్నారు. ఎంపీడీఓ, వెలుగు కార్యాలయాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఎంపీడీఓ జి.చంద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలు పూర్తిగా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామ స్థాయిలో పథకాలు అమలు చేసే తీరును మాస్టర్ ట్రైనీలు వివరించారు. మండల పరిషత్ సిబ్బంది, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం



ప్రయోగం ద్వారా పంట దిగుబడి అంచనా వేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో రైతు పువ్వల రామారావు వరి పొలంలో పంటకోత ప్రయోగం మంగళవారం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో చేసిన ఈ ప్రయోగంలో 15 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు జీవ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చని, ప్రతిఒక్కరూ ప్రకృతి సాగు వైపు పయనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఎఫ్ఆర్‌పీ యశోద, జట్టు కో–ఆర్డినేటర్ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



దుగ్గిలో విద్యార్థులకు బోధిస్తున్న సీఎంఓ చిరంజీవి

సీతంపేట: మండలంలోని దుగ్గి, రాయిలంక ప్రాథమిక పాఠశాలలను మంగళవారం పీఎంఆర్‌సీ బృందం సందర్శించింది. దుగ్గి పాఠశాల విద్యార్థుల చదువులకు సీఎంఓ చిరంజీవి పరిశీలించారు. మూడో తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారు, కూడికలు, తీసివేతలు, భాగహార, గుణకారాలు, వాచకపఠన తదితర అంశాలు చూశారు. రాయిలంకలో బాలికల చదువులను జీసీడీఓ రాములమ్మ పరిశీలించారు. మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈఓ ప్రకాశరావు

వీరఘట్టం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు దన్నాన ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక రమాసత్యన్నారాయణ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ ఈ సంఘం అండగా ఉంటుందని అధ్యక్షుడు డి.ప్రకాశరావు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన పెన్షనర్స్‌కు ఈ సందర్భంగా నివాళులర్పించారు. పెన్షనర్స్ తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక సామాజిక భవనం అవసరం ఉందని, ప్రభుత్వ పరంగా స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు కిల్లారి సన్యాసినాయుడు, వంతరాం అక్కులు, మాచర్ల శ్రీరాములదొర, మోనంగి భీమరాజు, శాశల విజయారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.